www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025
5
చిత్తూరు

శ్రీవారి సేవలో 'తండేల్' మూవీ టీమ్

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తండేల్ చిత్ర బందం సభ్యులు దర్శించుకున్నారు. గురువారం స్వామి వారి విఐపీ విరామ సమయంలో చిత్ర కథానాయకుడు నాగ చైతన్య, కథానాయకి సాయి పల్లవి, దర్శకుడు చందూ మొండేటి, చిత్ర నిర్మాతలు అల్లు అరవింద్, నాగ వంశీలు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి, పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల దర్శకుడు చందూ ముండేటి మాట్లాడుతూ సినిమా ఘనవిజయం సాధించడంతో చిత్ర సభ్యులంతా శ్రీవారిదర్శనార్థం వచ్చామని తెలిపారు.

కోళ్ల పరిశ్రమపై

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

కోళ్ల ఫారాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ప్రకటనలపై పౌల్ట్రీ రైతుల అసంతృప్తి
- తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1750 పౌల్ట్రీ ఫారాలు

ప్రజాశక్తి- యాదమరి

బర్డ్ ఫ్లూ ప్రభావంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమ రైతులు అధికారుల ప్రకటనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ లక్షణాలతో కోళ్లు ఎక్కడ చనిపోలేదని, బర్డ్ ఫ్లూ పట్ల పౌల్ట్రీ పరిశ్రమ రైతులు, ప్రజలకు ఆందోళన అక్కర్లేదని, బర్డ్ ఫ్లూ లక్షణాలు పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉండడంతో ప్రజలు అప్రమంతంగా ఉండాలని సూచించామే తప్ప ఎక్కడ భయాందోళనలకు గురికావలసిన అవసరం లేదని పశుసంవర్ధన శాఖ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 1750 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. నెలకు సరాసరి 75 లక్షల కోళ్ల ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 50 లక్షలు మేర ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా పౌల్ట్రీ పరిశ్రమలో 30వేల మంది ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో పౌల్ట్రీలో కోటి మూడు లక్షల ఇరవై వేలకు పైగా కోళ్లు పెంపకం చేస్తున్నారు. అందులో కోళు ,, 58,41608, లేయర్స్ 36,56123, పెరటి కోళు ,,, 823121, బాతులు 1821, మొత్తం 10 సంవత్సర శాఖ గణాంకాల ప్రకారం ఒక కోటి మూడు లక్షల 20 వేలకు పైగా కోళ్ల పెంపకం చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

అంతరాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉన్న నేపథ్యంలో మొదట సంవర్ధక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా సరిహద్దులైన తమిళనాడు, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దుల్లో పౌల్ట్రీ దిగుమతులు జిల్లాలోకి అనుమతించకుండా, ముందుస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెవెన్యూ, పోలీసు, శాఖల సమన్వయంతో పౌల్ట్రీ దిగుమతులను లోనికి రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని పౌల్ట్రీ ఫారాల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ రైతులకు బయో సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తూ సూచనలు సలహాలు ఇస్తున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన రెవెన్యూ పోలీసు అధికారులు

ఆందోళన అక్కర్లేదు.. జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు.

- ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా

పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉండి కోళ్లు చనిపోవడంతో జిల్లాలో అన్ని మండలాల్లోని పశుసంవర్ధక శాఖ అధికారులను అప్రమత్తం చేసాం. కోడిగుడ్డు, కోడి మాంసంను ఉడికించినప్పుడు 50 డిగ్రీలు దాటితే వైరస్ చనిపోతుంది. గుడ్డు మాంసంను మనం 150 నుంచి 200 డిగ్రీలు ఉష్ణోగ్రస్థాయిలో ఉడికించి తర్వాతే తీసుకుంటాం కనుక మనపై వైరస్ ప్రభావం ఉండదు. కోళ్ల పరిశ్రమ రైతులకు శానిటేషన్, బయో సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నాం. పౌల్ట్రీ ఫారన్‌లు కోళ్లు చనిపోతే వెంటనే సమీపంలోని పశు వైద్యులకు తెలియజేయాలని ముందు జాగ్రత్త చర్యలుగా పౌల్ట్రీ రైతులకు సూచించాం

చికెన్ తినడం వల్ల బర్డ్ ఫ్లూ రాదు..

బర్డ్ ఫ్లూ ఏవిఎన్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఈ వైరస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే చనిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మాంసం కోడిగుడ్డును మనం 150 నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించిన తర్వాతే తీసుకుంటాం కాబట్టి వైరస్ ప్రభావం ఉండదు. మైనస్ డిగ్రీల్లో ఉండే దేశాల్లో ఇది మనుషులకు వ్యాపిస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ఉండే ఉష్ణోగ్రతలు కోడి మనుగుడుకు అనువైనవి కోడిలో రోగనిరోధక శక్తి పెరిగేందుకు తగిన మందులు ఇవ్వడం ద్వారా ఈ వైరస్ ప్రభావం పెద్దగా ఉండదు.

కోడి గుడ్డు, మాంసం పౌష్టికాహారం

- ఎం.సుబ్రహ్మణ్యం నాయుడు పౌల్ట్రీ అడ్వైజర్, చిత్తూరు

చికెన్, కోడిగుడ్డు వాడకంపై అధికారులు చేసిన ప్రకటనలపై పౌల్ట్రీ రైతులు నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఎక్కడ గాని బర్డ్ ఫ్లూ అనేది లేదు. వదంతులను నమ్మి ఇమ్యూనిటీ పెంచడంలో పౌష్టికాహారంలో చికెన్, కోడిగుడ్డు అగ్రామి అపోహలతో ప్రొటీన్ అందిస్తున్న మాంసంకు దూరం కావద్దు. భారతీయుల వంట విధానంలో ఏ వైరస్ ఆరోగ్యంపై ప్రభావితం చేయదని, కరోనా సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఎందరో మేధావులు, శాస్త్రవేత్తలు డాక్టర్లు తెలిపారు. వ్యాధి నిరోధకంగా ఇమ్యూనిటీని పెంచడంలో కోడి గుడ్డుదే ప్రముఖ పాత్ర.

మురుగు పారదు.. కంపు వదలదు..!

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- అధ్వానంగా కాలువలు
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- దోమల స్వైరవిహారం
- రోగాల భయంతో వణుకుతున్న ప్రజానీకం

ప్రజాశక్తి- విజయపురం (నగరి):

'ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి' అని ఓ సినీ రచయిత రాసిన ఈ గేయం అచ్చు గుద్దినట్టు పురపాలకశాఖ అధికారులకు సరిపోతుంది. 'పరిశుభ్రతతోనే ఆరోగ్యం' అని నిత్యం ప్రజలకు హితబోధ చేస్తున్న సదరు అధికారులు, పట్టణంలోని కాలువలను శుభ్రం చేసే విషయాన్ని మాత్రం పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా కాలువల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో జనాలను రోగాల భయం వెంటాడుతోంది.

కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పేరు గొప్ప.. ఊరు దిబ్బ....

నగరి పట్టణంలోని పలు ప్రాంతాల్లోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. దుకాణాలు, ఇళ్ల ముందు చెత్త కుప్పలుగా ఉండడంతో, వీటికి ఆనుకుని ఉన్న ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు దోమల బెడద అధికంగా ఉన్నాయని, దోమకాటుకు ఎప్పుడు ఏ రోగం సోకుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

దోమలకు నిలయంగా మారాయి..

నగరి మునిసిపాలిటీ సమీపంలో ఉన్న 2వ వార్డు, కాకవేడు గ్రామంలో, 10వ వార్డు గాంధీనగర్‌లో 6వ వార్డులో డ్రైనేజీను అస్తవ్యస్తంగా మారాయి. చెత్తాచెదారం విపరీతంగా పేరుకుపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఫలితంగా రేయింబవళ్లు తేడా లేకుండా దోమలు, ఈగలు స్వైరవిహారం చేయడంతో కంటిమీద కునుకు తీయని దుస్థితి దాపురించిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. దోమల వలన తరచూ రోగాల భారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, దోమల నివారణకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని నగిరి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దోమలకు నిలయంగా మారిన మురుగు

బర్డ్‌ఫ్లూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కోళ్ల నుంచి మనుషులకు సోకేటటువంటి బర్డ్‌ఫ్లూ వ్యాధి పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధారాణి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఏవిఎన్ ఇంఫ్లు ఎంజా వైరస్ సోకడం వలన కోళ్ల బర్డ్‌ఫ్లూతో చనిపోతాయని, ఇలా చనిపోయిన కోళ్లను తగిన జాగ్రత్తలు పాటించి భూమి పూడ్చి పెట్టాలని లేకుండే ఆ వ్యాధి మనుషులకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లకు సంబంధించిన కోళ్ల ఫారంలో ఉపయోగించిన దానా, కోడి మాంసం, వ్యర్థాలు, నీరు జనావాసాలకు దూరంగా ఓ పాలిథిన్ సంచిలో పెట్టి పూడ్చి పెట్టాలని, లేకుండా కాల్చివేయాలని తెలిపారు. అలాగే కోళ్ల షెడ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో రోజూ శుభం చేయాలన్నారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోడి మాంసం తినడం వలన మనుషులకు వ్యాధి వస్తుందని ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఈ వ్యాధిపై జాయింట్ డైరెక్టర్ అనిమల్ హాస్బండరీ డాక్టర్ ప్రభాకర్ జిల్లా పూర్తిగా సర్వలిన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ వ్యాధి ఎక్కడ లేన్పటికీ ముందస్తు జాగ్రత్తలు ప్రజలు తప్పనిసరిగా తీసుకోవాలని, బయట రాష్ట్రాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకోకుండా చెక్‌పోస్టల వద్ద ప్రత్యేక నిఘా ఉంచడమైందని ప్రజలు కొద్దిరోజులపాటు కోడి మాంసం, కోడి గుడ్లు తినకుండా జాగ్రత్త వహించాలని డాక్టర్ సుధారాణి తెలియజేశారు. ఎవరికైనా అనుమానం ఉన్న కోళ్ల మాంసం తిన్న తర్వాత జ్వరం, గొంతు బొంగురు పోవడం, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు, ఒళ్ళు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారికి చూపించాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలోని వైద్యాధికారులకు బర్డ్ ఫ్లూ పై ముందస్తు అవగాహన, నివారణ చర్యలు నిర్వహించాలని తెలిపారు.

'సీడాప్'తో నిరుద్యోగ యువతకు ఉపాధి

ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తోందన్నారు. దేశంలోని అతిపెద్ద నైపుణ్య శిక్షణ సంస్థగా పేరొందిన 'సీడాప్' అనే సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగుతుందన్నారు. ఉపాధి, మార్కెట్ ఆధారిత నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రతి పేద గ్రామీణ కుటుంబానికి వ్యవస్థీకృత రంగంలో ఉపాధి అవకాశాన్ని కల్పించాలన్నదే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పమన్నారు. ఈ నేపథ్యంలోనే సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (సీడాప్) సంస్థలో 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ యువత ఉపాధి కోసం క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన ఎంపీడీవో

ప్రజాశక్తి- సోమల: సోమల శివాలయం ఎదురుగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఎంపీడీవో నారాయణ, ఈవోఆర్‌డి లక్ష్మీదేవి గురువారం పరిశీలించారు. గత కొన్ని నెలలుగా వాటర్ ప్లాంట్‌లోని యంత్ర సామాగ్రి పని చేయకపోవడం, ప్లాంట్‌కు నీటిని సరఫరా చేసే బోరులో తక్కువ కెపాసిటీ గల మోటార్ ఉండడం కారణంగా నిత్యం మరమ్మతులకు గురవుతూ బాగు చేసిన మళ్లీ ఏదో ఒక సమస్య తలెత్తుతూ ఉండడంతో కొన్ని నెలలుగా వాటర్ ప్లాంట్‌ను మూసివేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో, ఈవోఆర్డి వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి బోరు మోటారు కెపాసిటీ పెంచడం మరమ్మతుకు గురైన యంత్రాలను బాగుచేయించి ప్రజలకు శుద్ధజలాన్ని అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు వచ్చే మార్గంలో

ట్రెంచ్ కొట్టిన అధికారులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ఆక్రమంగా ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్న కారణంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని బుధవారం సత్రవాడ, వినాయకపురం గ్రామస్తులు ధర్నా, రాస్తారోకో చేయడంతో అధికారులు స్పందించారు. ఇసుక ఆక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పూనుకున్నారు. గురువారం సమస్యకు కారణమైన ప్రాంతాలను రెవెన్యూ సిబ్బందితో పాటు పరిశీలించిన తహశీల్దార్ రవికుమార్ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు కుశస్థలి నది నుంచి ఇసుక రవాణాకు అనువుగా ఉన్న సత్రవాడ, కేవీపీఆర్‌పేట, ఏకాంబరకుప్పం ప్రాంతాల్లోని మార్గాల్లో జేసీబీ ద్వారా దారుల్లో ట్రెంచ్ కొట్టి ట్రాక్టర్లు ప్రయాణించలేని విధంగా పెద్దపెద్ద గోతులు తీయించార. ఈ మరో మార్గం ఏదైనా సిద్ధం చేసుకొని ఇసుక తరలింపుకు ప్రయత్నిస్తే తమకు సమాచారం అందించాలని వీఆర్వోకు, సచివాలయ సిబ్బందికి, గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ మేఘవర్ణం, వీఆర్వోలు జయశంకర్, కేశవులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు అడ్డుకట్ట వేసేందుకు జెసిబితో ట్రెంచ్ కొట్టిన అధికారులు

ఫారెస్ట్ రోడ్డు పనులు పరిశీలన

రోడ్డు పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలో ఫారెస్ట్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ గురువారం పరిశీలించారు. పివికేన్ కళాశాల వద్ద జరుగుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు నిర్మాణంలో మార్గదర్శకాలు పాటించాలని, నాణ్యతా ప్రమాణాలు నిర్దేశించిన మేర ఉండాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల సమయంలో అధికారుల పర్యవేక్షణ చక్కగా ఉండాలన్నారు. నగరపాలక పరిధిలో చిత్తూరు – వేలూరు రోడ్డులో బీసీ భవన్ నుంచి మ్యాంగో భవన్ వరకు రూ.కోటి వ్యయంతో ఫారెస్ట్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనులను సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏఈ లోకేష్ ఉన్నారు. గురువారం ఉదయం కమిషనర్ నగరంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. సిద్ధార్థ నగర్ వద్ద మురుగునీటి కాలువను పరిశీలించి, పైప్లైన్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పలువార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో

పీఈఎస్ విద్యార్థికి జిల్లా ప్రథమ ర్యాంకు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జేఈఈ మెయిన్స్ 2025 ఫేజ్ 1 పరీక్షలకు సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాలలో పిఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థి టి.అరవింద్‌కు 98.88 పర్సెంటైల్‌తో చిత్తూరు జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకు సాధించారు. అలాగే జే.వినయ్‌కు 92.37 పర్సెంటైల్ పాఠశాల స్థాయి రెండవ స్థానంలో నిలిచినందుకు పీఈఎస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎంఆర్ దొరస్వామి, ప్రిన్సిపాల్ వైవి.కృష్ణబాబు, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ విజయానికి కారణమైన సంస్థ యాజమాన్యానికి, అధ్యాపకులకు, ప్రిన్సిపాల్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఆర్ దొరస్వామి

స్వామీ నీ భూములు స్వాహా..

- ఆలయ మాన్యం అన్యాక్రాంతం
- భూములపై పెత్తందారుల పెత్తనం
- ధూపదీపాలకు నోచుకోని గుడులు
- మామూళ్లతో అధికారులు సరి..

దేవుడి మాన్యం అన్యాక్రాంతం అవుతోంది.. వందలాది ఎకరాలను గ్రామ పెత్తందార్లు తమ ఆధీనంలో ఉంచుకుని పెత్తనం చేస్తున్నారు.. దశాబ్దాల తరబడి ఆలయ అధికారులు లేకపోవడంతో గుడిలో ధూపదీప నైవేద్యాలకు సైతం నోచుకోవడం లేదు. రాజుల కాలంలో భక్తిశ్రద్ధలతో ఆలయాలను అభివృద్ధి చేసేవారు.. తమ భూములను దానంగా ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.. ఇలా వచ్చిన ఆదాయంతో దేవుడికి నిత్యకైంకర్యాలు జరిగేవి ప్రస్తుత పాలకులు 'దేవుని మాన్యం' పైనే కన్నేసి అధికారులతో కలసి భక్తులకు పంగనామాలు పెడుతున్నారు. యాదమరి మండలంలోని దేవాలయ పరిధిలో భూములను ప్రజాశక్తి గమనించగా పెద్ద మొత్తంలో అన్యాక్రాంతం అయినట్లు తెలుస్తోంది.



యాదమరిలోని వరదరాజుల స్వామి దేవాలయం

ప్రజాశక్తి- యాదమరి: మండలంలో దేవాదాయశాఖ ఆధీనంలో 30 ఆలయాలు ఉన్నాయి. వీటికి సంబంధించి 83.54 ఎకరాల భూమి ఉంది. దేవాదాయశాఖ ద్వారా వ్యవసాయానికి దాదాపు 21ఎకరాలను కేటాయించారు. అలాగే మెట్టకు సంబంధించి 62 ఎకరాల భూమి ఉంది. మండల వ్యాప్తంగా భూములను పరిశీలిస్తే చాలా వరకు గుడిమాన్యం అన్యాక్రాంతం అవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది పెత్తందారులు పలుకుబడితో కౌలుదారి చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయల విలువ చేసే భూములను స్థానిక రెవెన్యూ అధికారుల అండతో కాజేశారన్న ఆరోపణలున్నాయి. ఈ భూములకు కౌలుగా నామమాత్రంగా ధర చెల్లిస్తూ వారి ఆధ్వర్యంలోనే అనుభవిస్తున్నారని, ఆలయ భూముల రికార్డులు తారుమారు చేస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు.

మండలంలోని దసరాపల్లి గ్రామం సర్వే నెంబరు 276లో పది ఎకరాల 76 సెంట్ల భూమిని కౌలుదారులకు లీజుకు ఇచ్చారు. అదే గ్రామంలోని రంగనాథస్వామి ఆలయ పరిధిలో 394.1లో 7.61 ఎకరాలు 395.2లో 6.68 ఎకరాలు 326.8 స్థలాన్ని కొందరు స్థానికులు ఆక్రమించుకుని అనుభవిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వీరు గత కొన్ని సంవత్సరాలుగా దేవాదాయశాఖకు నామమాత్రంగా రుసుం చెల్లిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదు. కోదండరామ స్వామి వరదరాజస్వామి దేవాలయంకు చెందిన సర్వేనెంబర్ 259, 262లోని 4.2 ఎకరాలు సర్వేనెంబర్ 373 2.59 ఎకరాల భూమిని పెత్తందారులు, నాయకులు కొన్ని సంవత్సరాలుగా తన ఆధీనంలో ఉంచుకుని వాటికి బినామీ పేర్లతో రికార్డులు తయారు చేసి బ్యాంకులో రుణాలు పొందుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే గొందివాళ్ల ఊరు రామ భజన మందిరం సర్వేనెంబర్ 407లో మూడు పాయింట్ 35 ఎకరాల భూమి స్థానిక భూస్వామి ఆక్రమించుకున్నాడు. 155 కమ్మపల్లిలో సర్వే నెంబర్ 86లో 4.04 ఎకరాల భూమిని స్థానిక నాయకుడు అనుభవిస్తున్నారు. కాశిరాళ్ల గ్రామం చెందిన విగ్నేశ్వరుని దేవుడి మాన్యం 240.2లో 4.78 సెంట్లు అన్యాక్రాంతమైంది. ముత్యాలమ్మ దేవుడి మాన్యం నెంబర్ 30.1లో 6.70 ఎకరాలు ఆక్రమణలకు గురి అయ్యాయి. మండలంలోని చాలా వరకు దేవుడి మాన్యాలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని భక్తులు వాపోతున్నారు.

మండల వ్యాప్తంగా దేవాదాయ భూములకు సంబంధించిన రికార్డులు పూర్తిస్థాయిలో లేకపోవడం, రికార్డులకు సంబంధించిన కనీస సమాచారం లేకపోవడంతో పలు కీలకమైన కేసుల్లో దేవాలయాలకు నిధులు లేకుండా పోతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు సంబంధించిన భూముల వివరాలను సమగ్రంగా విచారణ జరపాలని దీనిపై సంబంధిత అధికారులు స్పందించి దేవాలయాల భూములను పరిరక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు. దేవాదాయశాఖ మంత్రి పదేపదే దేవాలయ భూములను ఆన్లైన్లో ఉంచుతామని చెబుతూ కబ్జాదారులపై కరుణ చూపిస్తూనే ఉండటం గమనార్హం.



దసరాపల్లిలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం

పల్లెను కప్పేసిన మంచు

పాతపాల్యం వద్ద పంట పొలాలపై కమ్ముకున్న మంచు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలో పలుచోట్ల పల్లెలను మంచు కప్పేసింది. మంచు తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం 9 గంటలకు కూడా రైతులు వల్ల వ్యవసాయ పనులు చేపట్టలేకపోతున్నారు. మంచు వీడిన అనంతరం పనులకు వెళు తున్నారు. మంచు తుంపర్లతో పంటలకు చీడలు వ్యాపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపంజేరి, పాతపాల్యం, తూగుండ్రం, కొత్త వెంకటాపురం, ఆంబోదరపల్లి తదితర గ్రామాల్లో మంచు ప్రభావం అధికంగా ఉంది.

మామిడి కవర్లకు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- బంగారు పాల్యం: మామిడి రైతులు మామిడికాయలకు కావలసిన కవర్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రంలో తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటే వారికి కవర్లు తెప్పిస్తామని తెలిపారు. కవరు ధర ఒక రూపాయితో పాటు అన్లోడింగ్‌కు అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: నేడు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి హాజరయ్యే మండల అధికారులు పూర్తి సమాచారాన్ని చేరవేయాలని, తర్వాత సమావేశంలో చర్చించాలని సూచించారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండల అధికారులు సమయపాలన పాటించి సమావేశానికి రావాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బంగారుపాళ్యం : పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం గురువారం మండలంలోని తుంబపాల్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మాజీ మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియను అభ్యసించి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. తుంబపాల్యం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోదండ యాదవ్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాభవాని, బాబు, గిరిధర్ నాయుడు, అమరేంద్ర ,రీటా, దామోదర్ ,నజ్మా పలువురు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు బహుమతి

విద్యార్థిని సాయి బృందను అభినందిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

ప్రజాశక్తి - గంగవరం: జనవరిలో నిర్వహించిన జేఈఈ నీట్ సెక్షన్ వన్ పరీక్షలలో మదర్ తెరిసా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.సాయి బృందా 98.1 శాతం మార్కులు సాధించి, జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి పదివేల రూపాయలు నగదు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అధికారి రాజేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విజయం పాఠశాల వార్షికోత్సవం

విజయం పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ :చిత్తూలోని విజయం పాఠశాల 14వ వార్షికోత్సవ సంబరాలు ఇండిస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న ఆర్.ఎల్.ఎన్. ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల అదినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి, ఆకడమిక్ డైరెక్టర్ శైలజా మూర్తి, ముఖ్యఅతిదిగా సమగ్ర అభియాన్ జిల్లా అధికారి వెంకటరమణ, మండల విద్యాధికారి మోహన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలందరూ అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని విద్యను కొనసాగించాలన్నారు. గౌరవ అతిథి కె.మోహన్ మాట్లాడుతూ శ్రద్ధతో విద్యా జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యతో పాటుగా, క్రమశిక్షణను పెంపొందాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత వహించాలని విజయం పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శైలజాతేజోమూర్తి వెల్లడించారు. విజయం విద్యా సంస్థలు అధినేత ఎం.తేజోమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి విజయం పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించడమే కాకుండా, వారి భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు గత సంవత్సరంలో గెలుపొందిన ఫలితాలను బట్టి వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు, 'శివపురాణం' నాటకం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ శ్రీదేవి, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్ఈడి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లిలో 15,16 తేదీల్లో గంగమ్మ జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం బాట గంగమ్మ గుడి దగ్గర ఎంపీపీ నిధులతో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప గురువారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రేజ్, యువ నాయకులు రాజు, వైస్ ఎంపీపీ జైకుమార్ రెడ్డి, వార్డ్ మెంబర్ షాకీర్, మండల యూత్ ప్రెసిడెంట్ మహేష్, మీడియా కన్వీనర్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు పెద్ద పీట వేయండి

- గ్రామాల్లో పరిశుభ్రత బాధ్యత కార్యదర్శులదే
- పేడదిబ్బల తొలగింపులో నిర్లక్ష్యం వద్దు : డీపీవో సుధాకర్‌రావు

కార్యదర్శులతో కలసి చెత్తశేకరణ చేపడుతున్న డీపీవో సుధాకర్‌రావు

ప్రజాశక్తి - కార్వేటినగరం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధికారులు పెద్ద పీట వేయాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు సూచించారు. గురువారం మండల కేంద్రంలో 9 మండలాల ఈవోపీఆర్డీలు, కార్యదర్శులకు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీలలో పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యాత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి కార్యదర్శి క్షేత్ర స్థాయిలో పారిశుధ్య లోపాన్ని గుర్తించి, మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పని చేయాలన్నారు. ప్రతి ఎస్ డబ్ల్యు పీసీ నుంచి చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు కృషి చేయాలన్నారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం, మాంబేడు పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఆయా కార్యదర్శుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్వేటి నగరం మండలంలో అనేక పంచాయతీ లు పారిశుధ్యం మెరుగుగా ఉండడంతో ఈవోపీఆర్డీ నాగరత్నమ్మను అభినందించారు. ఇటీవల పలమనేరు పంచాయతీ ఆకస్మిక తనిఖీలో మండపేట గ్రామం ఆదర్శంగా ఉందని. అక్కడి కార్యదర్శిని అభినందించడం జరి గిందని గుర్తు చేశారు. పంచాయతీ పరిధిలో రోడ్లపై పేడ దిబ్బలు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పారు. బంగారు పాళ్యం మండలం బొమ్మసముద్రం పంచాయతీ పారిశుధ్యం మెరుగులో ఉత్తమ పంచాయతీగా నిలిచి దేశ స్థాయిలో, రాష్ట్రపతి చేతుల మీదుగా కార్యదర్శి మౌనిక అవార్డును అందుకుని, రూ. కోటి నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలాంటి వారిని ప్రతి కార్యదర్శి ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. అనంతరం డీఎల్ పీవో పార్వతి మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపడితే ప్రజలంతా ఆరోగ్యకరంగా ఉంటారని, కార్యదర్శుల చేతుల్లో ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. అలాగే మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పడుతుందన్నారు. ప్రజలు తడి పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు విడివిడిగా అందించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కార్వేటినగరం పట్టణ వీధుల్లో చెత్తబుట్టలతో డీపీవో ఆధ్వర్యంలో చెత్త సేకరణ కార్యక్రమం చేపడుతూ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ షణ్ముగం, ఎంపీడీవో చంద్రమౌళి, ఈవోపీఆర్డీలు నాగరత్నమ్మ, లక్ష్మీపతి, మండల కోఆర్డినేటర్ ఏకాంబరం. పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక వసూళ్లు ఆపండి

ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్

ఆటో కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయు నాయకులు

ప్రజాశక్తి - విజయపురం (నగరి) :ఆటో కార్మికుల వద్ద గుత్తహక్కుల పేరిట అధిక వసూలు చేయడం రద్దు చేయాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్, ఏసు, నందకుమార్ అధ్యక్షతన నిర్వహించిన దర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఆటో కార్మికుల దగ్గర రోజుకు 30 రూపాయలు వసూలు చేయడం లేదన్నారు. కానీ ఒక నగరిలో మాత్రం టెండర్లు ఎక్కువ పెట్టినమని బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు కార్పొరేషన్లు 5 మున్సిపాలిటీల్లో కూడా ఇంత అధిక మొత్తంలో ఆటో కార్మికుల నుంచి వసూలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయబద్ధంగా నామమాత్రపు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తరపున ఏదైనా జీవో ఉంటే ఆ జీవో మేరకే వసూలు చేయాలని కోరారు. డీజిల్ రేట్లు పెరిగి అవస్థలు పడుతున్న తరుణంలో వసూళ్లు పెంచడం బావ్యం కాదన్నారు. మున్సిపాలిటీ నిధులు సమకూర్చుకోవడానికి విచ్చలవిడిగా టెండర్లు వదలి, కార్మికుల వద్ద బలవంతపు వసూళ్లు చేయడం తగదన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి సమస్య పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిగిలిన మున్సిపాలిటీలలో ఆటో కార్మికులకు టెండర్లు ఎలా ఉందో విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సీనియర్ నాయకులు వేలన్, నాయకులు భాషా, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గోపాల్, లాజర్, ఆరుముగం, రాజశేఖర్, దయానిధి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ ఇంటింటి ప్రచారం

ఇంటింటికి వెళ్లి పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - చిత్తూరు : ప్రత్యేక ప్రతిభ కలిగిన బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా చిత్తూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపడుతోంది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, చిత్తూరు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్.భారతిల పర్యవేక్షణలో ఇంటింటికి వెళ్లి న్యాయ ప్రచారం నిర్వహిస్తున్నారు. పుట్టుకతో వచ్చే లోపాల వల్ల వికలాంగులైన బాలలను గుర్తించి వారికి సరైన వైద్య సహాయం, న్యాయ సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలో 64 బృందాలు అర్హులను గుర్తించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. చిత్తూరు జిల్లాలో ఈనెల పదవ తేదీ నుంచి 12 వ తేది వరకు నిర్వహించిన న్యాయ ప్రచారంలో 6,061 గృహాలను సందర్శించారు. ఇందులో 60 మంది పిల్లలు ఎదుగుదల లోపంతో ఉన్నట్లు గుర్తించారు. వీరికి సరైన చికిత్స అందించేలా న్యాయ సేవ అధికార సంస్థ చర్యలు తీసుకుంది. ప్రత్యేక ప్రతిభ కలిగిన పిల్లలను గుర్తించే బృందంలో న్యాయవాది, పేరా లీగల్ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, వైద్యాధికారి ఉంటారు. వీరు గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక ప్రతిభ కలిగిన బాలలను గుర్తించి వారికి అవసరమైన సేవలను అందించేందుకు తోడ్పడతారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన బాలలకు డిఈఐసి, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం, రాష్ట్రీయ కిశోర సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తారు. చిత్తూరు, శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణపురం, వైయస్ గేటు ప్రాంతాల్లో పర్యటించి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను పలకరించడం జరిగింది. గ్రామాల్లో వైద్య సహాయం అవసరమైన పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు అందించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి కోరారు. ప్రత్యేక ప్రతిభ కలిగిన బాలలకు సంబంధించిన వారు న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదిస్తే వైద్య, న్యాయ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సోమల: మేజర్ పంచాయతీ, కందూరు పంచాయతీ కార్మికులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది గురువారం వైద్య పరీక్షలను నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు నిత్యం మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని తొలగించడం చేస్తూ ఉంటారన్నారు. దీనివల్ల వారికి బ్యాక్టీరియా సోకి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందరన్నారు. ఇందుకోసం వారికి బివి, షుగర్, రక్త పరీక్షలను నిర్వహించి మందులు, మాత్రలను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు తమ విధులు ముగించుకొని, చేతులు భ్రంగా కడుక్కొని తర్వాత ఆహారాన్ని భుజించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ మంచి అలవాట్లు నేర్పుతుంది

ప్రజాశక్తి - విజయపురం (నగరి):క్రమశిక్షణ మంచి అలవాట్లు నేర్పుతుందని సీఐ మహేశ్వర్ అన్నారు. గురువారం కాకవేడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి అలవాట్లపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విజ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. దురవాట్ల వలన ఎందరు జీవితాలను నాశనం చేసుకుంటున్నారో వివరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చున్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వి కోట : మండల కేంద్రమైన వీకోటలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక బాలల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఓ ప్రైవేట్ టీవీ ఛానల్ వారి ఆధ్వర్యంలో పిఈఎస్ ఆసుపత్రి సహకా రంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు ప్రారంభించారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

అంధత్వ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - కుప్పం న్యూస్ : కుప్పం బాలికోన్నత పాఠశాలలో జాతీయ అందత్వ నివారణ దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ బాబు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్న సూక్తిని నిజం చేస్తూ ప్రతి ఒక్కరూ కంటి చూపును కాపాడుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు అవసరమైన కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట కార్డు దరఖాస్తుకు విశేష స్పందన

ప్రజాశక్తి - సోమల: మండలంలోని రైతులు రైతు విశిష్ట కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో విశేష స్పందన లభిస్తోందని, ఇంకా ఎవరైనా కార్డు కోసం దరఖాస్తు చేసుకోకుండా ఉంటే ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు దరఖాస్తు చేసుకోవడానికి రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్కు లింక్ అయిన ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకువెళ్లాలని కోరారు. విశిష్ట గుర్తింపు కార్డు పొందని రైతులు పంటల బీమా, పిఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు అర్హత కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రోబోటిక్ పోటీల్లో మదర్ థెరిసా విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి - పెద్దపంజాణి: జాతీయస్థాయి రోబోటిక్ పోటీల్లో మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ బర్క్ మన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు చెన్నై విట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆరవ జాతీయస్థాయి రోబోటిక్ పోటీల్లో మదర్ థెరిసా పాఠశాల తరపున ఎనిమిదవ తరగతి విద్యార్థులు నలుగురు పాల్గొన్నారు. వీరిలో శివరాజ్ ప్రథమ, మోహన కృష్ణ ద్వితీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్ర బాబు విద్యార్థులను అభినందిస్తూ రాబోయే కాలంలో మరిన్ని బహుమతులు గెలవాలని ప్రోత్సహించారు. భవిష్యత్ తరాలలో తమ పాఠశాల టెక్నాలజీ, శాస్త్ర రంగాలలో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే విధంగా సౌకర్యాలు కల్పిస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ బర్క్ మన్ అన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించండి

ప్రజాశక్తి - శాంతిపురం : రానున్న వేసవిలో త్రాగినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఎంపీడీవో కుమార్‌కు సూచించారు. గురువారం శాంతిపురం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక జెడ్పిటిసి సభ్యులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగినీటికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏవి జయరాం, కొలమడుగు సర్పంచ్ మంజునాథ్, దిన్నేపల్లి సర్పంచ్ గోపాల్, సర్పంచ్ శంకర్, నాయకులు మురళీమోహన్ రెడ్డి, వినోద్ కుమార్, పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు

ప్రజాశక్తి - పలమనేరు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటం తప్పదని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు గురువారం పలమనేరులో జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అర్హత గల ప్రతి నిరుపేదకు పార్టీ, కుల, మతాలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణానికి కావలసిన ముడి సరుకులు ఇసుక, ఇటుక, సిమెంటు, కమ్ములు, కంకర, రాష్ట్ర ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఐ పలమనేరు నియోజకవర్గం కన్వీనర్ సి.చెన్నకేశవులు, కో కన్వీనర్ బుర్రా మంజునాథ్ బాబు , సిపిఐ పుంగనూరు నియోజకవర్గ కార్యదర్శి కే.రామమూర్తి పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ అరికట్టడమే లక్ష్యం

ప్రజాశక్తి, కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గ పరిధిలో అక్రమ మైనింగ్ అరికట్టడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం కుప్పం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ శాఖ, భూగర్భ గనుల శాఖ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డిఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానిక పలమనేరి భూగర్భ గనుల శాఖ అధికారి, కుప్పం డి.ఎస్.పి పార్థసారథి, నియోజకవర్గంలోని ట్రాక్టర్ కంప్రెషర్ ఓనర్స్, ఎస్కార్ట్ క్రేన్ యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అక్రమ మైనింగ్ అడ్డుకోవడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ముఖ్యంగా వాహన యజమానులు అక్రమ మైనింగ్‌కు సహకరించరాదని సూచిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నియోజకవర్గ పరిధిలో రాతి కార్మికుల సమస్యలను విచారించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - యదమరి : సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు చిత్తూరు స్టేట్ బ్యాంక్ ఆర్ఎండి సురేష్ బాబు, చీఫ్ మేనేజర్ రాజేష్, బ్యాంక్ మేనేజర్ శిరీష ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. గురువారం చిత్తూరు స్టేట్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రీజనల్ మేనేజర్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుంచి అంకితభావంతో చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. యదమరి మండలంలోని జీవన గీత, భవిత, కమల్, ఫాతిమా, షానా, కేథలిన్, జలజ, రితిక, నేహా, జోత్స్నా, ప్రియదర్శిని, పదిమంది పదో తరగతి విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ చేశారు. సైకిల్స్ పంపిణీ చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యదమరి పాఠశాల హెచ్ఎం గిరి రాజారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

జూదం ఆడుతున్న వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - సదుం : జూదం ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన గురువారం సదుంలో వెలుగులోకి వచ్చింది. సదుం ఎస్సై షేక్ షావలి ఇచ్చిన వివరాలు మేరకు మండల పరిధిలోని ఎర్రాతివారిపల్లి గ్రామపంచాయతీ, గొడ్ల వారి పల్లి గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న పొలాల్లో మామిడి చెట్టు కింద ఎనిమిది మంది వ్యక్తులు లోపల – బయట (మంగతాయి) అనే జూదం ఆట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీస్ సిబ్బందితో వెళ్లి వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గురువారం విలేకరులకు తెలిపారు. వారి నుండి 10,620 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన విలేకరులకు తెలిపారు.

ఫోర్జరీ పత్రాలు తయారు చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - వెదురుకుప్పం : మండలంలోని, దిగువ పలాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వీఆర్వో సంతకాలను ఫోర్జరీ చేసి జి డి సి పత్రాలను సృష్టించాడు. గురువారం అతడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మీడియాకు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల మేరకు దిగువ పలాల గ్రామానికి చెందిన నారాయణరెడ్డి వీఆర్వో , పంచాయతీ సెక్రెటరీ ఫోర్జరీ సంతకాలతో సీల్ తయారుచేసి హక్కుదారుల పత్రాన్ని ఆలమడుగు గ్రామ లెక్కదాకలో గల సర్వే నెంబరు: 165 లో 280 చదరపు గజాల స్థలాన్ని నారాయణరెడ్డి తన పేరు మీద అనుభవం హక్కుపత్రాన్ని తయారు చేసుకున్నారని తెలిపారు. తన భార్య నాగమ్మ పేరుపై కార్వేటినగరం, సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ ఘటనపై వీఆర్వో హేమాద్రి, ఆలమడుగు పంచాయతీలో తన సంతకాలు ఫోర్జరీ చేసినారని ఫిర్యాదు చేయగా, కేసు రిజిస్టర్ చేసి ముద్దాయిని రిమాండ్ పంపారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందన

రవికుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి

ప్రజాశక్తి - కార్వేటినగరం: జాతీయ సమైక్యత క్యాంపు 2025లో పాల్గొని, ఉత్తమ సేవలు అందించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అభినందించారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులలో సేవా దృక్పదాన్ని పెంచేంచుకు ఎన్ఎస్ఎస్ క్యాంపులు దోహదపడుతుందన్నారు. జాతీయ సమైక్య క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు జాతీయ సమైక్యత, భిన్నత్వంలో ఏకత్వం, మత సామరస్యం అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు వారు సాధించే సర్టిఫికేట్లు ఉద్యోగ అవకాశాల్లో 30 శాతం రిజర్వేషన్ పొందే అవకాశం ఉదన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపుల్లో పాల్గొని తమ సేవలను అందించి, కళాశాలకు గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. అనంతరం జాతీయ సమైక్యత క్యాంపులో పాల్గొన్న రవికుమాను సన్మానించి మెమోంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనంజయరెడ్డి, అధ్యాపకులు సుబ్బారావు జోగి ప్రసాద్, కార్తీక్, విద్యాసాగర్‌లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి:మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో సిబ్బంది, సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. గురువారం కోగిలేరు సచివాలయాన్ని ఎంపీడీవో బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పినపల్లి గ్రామ సచివాలయాన్ని పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఆన్లైన్ అటెండెన్స్ వేయాలని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు అంగన్వాడి పిల్లలందరికీ ఆధార్, పుట్టిన తేదీ నమోదు తప్పనిసరిగా చేయించాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

జేసీబీ సాయంతో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-పెద్దపంజాణి:రాయల పేట గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు గురువారం పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో బాలాజీ ఆదేశాల మేరకు రాయల పేట పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ చేపట్టినట్టు, తాగు నీటి సౌకర్యాన్ని అందిస్తూ, పాడైన వీధిలైట్లను మార్చుతూ ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో సచివాలయ సిబ్బంది ఉంటున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సచివాలయ సిబ్బంది త్వరితగదన ఇస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి, బాలచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో 98 వినతులు

ప్రజాశక్తి, కుప్పం టౌన్ : కుప్పం పట్టణం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 98 వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడి వికాస్ మరమత్‌లు ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం నాలుగు మండలాల నుండి ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో అధికారులకు అందజేశారు. వీటన్నింటిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు ఫిర్యాదులను కేటాయిస్తూ, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.